క్లుప్తంగా

కరాటేతో విద్యార్థులకు రక్షణ



పెనమలూరు: విద్యార్థులు ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలని పెనమలూరు సీఐ వెంకటరమణ సూచించారు. కానూరు థెరిస్సా పాఠశాలలో విద్యార్థులకు జోష్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం శిక్షణా శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వెంకటరమణ మాట్లాడుతూ కరాటే నేర్చుకోవడం వల్ల అత్యవసర సమయాల్లో ఆత్మరక్షణకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అలాగే చదువుతో పాటు క్రీడల వల్ల ఆరోగ్యవంతంగా ఉండవచ్చని వివరించారు. అనంతరం శిక్షణ పొంది బెల్ట్‌లు సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ జాయిసీ, కరాటే కోచ్ పి.సత్య, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు నున్నలో గ్రామ సభ

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం ఉదయం 11 గంటలకు గ్రామ సర్పంచి కాటూరి సరళ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి కోట సురేష్ బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ గ్రామసభకు గ్రామస్తులు హాజరుకావాలని ఆయన కోరారు.

పేకాట శిబిరాలపై దాడులు

కంకిపాడు: పేకాట శిబిరాలపై కంకిపాడు పోలీసులు సోమవారం దాడులు చేశారు. ఎస్ఐ డి.సందీప్ తెలిపిన కథనం మేరకు.. పోలీసుస్టేషన్ పరిధిలోని గొడవర్రు, కంకిపాడు ప్రాంతాల్లోని బహిరంగ ప్రదేశాల్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో ఆ ప్రాంతాలపై దాడులు జరిపారు. దాడుల్లో ఏడుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 2,800 నగదు, రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశారు.

టీబీ వ్యాధిపై అవగాహన



గన్నవరం రూరల్: టీబీ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని ఆత్కూరు పీహెచ్‌సీ డాక్టర్ జితేంద్ర కుమార్ పేర్కొన్నారు. మండలంలోని కొత్తగూడెం గ్రామంలో టీబీ, సికిల్ సెల్ వ్యాధిపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. తెమడతో కూడిన దగ్గు, రక్తం పడటం, జ్వరం సమస్యలు టీబీ వ్యాధి లక్షణాలని చెప్పారు. సికిల్ సెల్ జన్యుపరమైన వ్యాధి అని, దీన్ని ప్రారంభంలోనే గుర్తించాలని సూచించారు. అనంతరం 104 వాహన వైద్య సేవల్లో పాల్గొన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ అంకూరి నాగమల్లేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పీ సిరి మేఘన, హెల్త్ అసిస్టెంట్ సాంబశివరావు, ఆశ వర్కర్లు రజిని, ప్రమీలారాణి పాల్గొన్నారు.

ఒత్తిడి లేకుండా చదవాలి

పెనమలూరు: విద్యార్థులు ఒత్తిడి లేకుండా చదవాలని ఏకం ఫౌండేషన్ ప్రతినిధి ఆప్తిజీ సూచించారు. కానూరు సిద్ధార్థ అకాడమీ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ డీమ్డ్ టుబీ యూనివర్సిటీలో యూత్ రెడ్‌క్రాస్ క్లబ్ ఆధ్వర్యాన ఒత్తిడి లేకుండా జీవితాన్ని ఎలా గడపాలి అనే అంశంపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆమె మాట్లాడుతూ ఒత్తిడి లేని జీవితాన్ని విద్యార్థులు గడపాలంటే ఆచరణాత్మకమైన వ్యూహాలపై దృష్టి పెట్టాలన్నారు. విజయ లక్ష్యం చేరుకోవడానికి ప్రణాళిక బద్ధంగా చదవాలని సూచించారు. చదువు పట్ల నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు సమయపాలన పాటించాలని సూచించారు. రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.రవిచంద్, ఫస్ట్ ఇయర్ ఇన్‌చార్జ్ డాక్టర్ కొల్లా నరేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. ప్రజలకు శాపం

- వర్షంనీరు పారుదల పరిగణనలోకి తీసుకోకుండా రోడ్డు నిర్మాణం
- చిన్న వర్షానికే గోసాల సెంటర్ జలమయం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



గోసాల సెంటరులో నిలిచిన వర్షం నీరు

కంకిపాడు: ఏళ్ల తరబడి సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు. చిన్న వర్షానికి సైతం ఆ ప్రాంతం అంతటా చెరువుమయంగా మారుతోంది. రోజులు తరబడి వర్షపునీరు కదలడం లేదు. మురుగుమయంగా మారి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారుల శాఖ అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా పరిణమించింది. ఈ ఇబ్బందులకు గోసాల సెంటర్ కేరాఫ్‌గా మారింది. విజయవాడ - మచిలీపట్నం జాతీయ రహదారి విస్తరణ, అభివృద్ధి పనులు పూర్తయ్యి మూడేళ్లు గడుస్తోంది. ఇందులో భాగంగా గోసాల ప్రధాన సెంటర్‌ను విస్తరించి ప్రజలు, వాహనాల రాకపోకలకు వీలుగా పాసేజ్ ఏర్పాటు చేశారు. గోసాల నుంచి మద్దూరు వెళ్లే ప్రధాన రహదారి మార్గానికి కొంత వరకూ డివైడరు కూడా నిర్మించారు. ప్రస్తుతం ఈ ప్రాంతమే ప్రజలకు నిత్యం ఇబ్బందికరంగా తయారైంది.

చిన్న వర్షానికే చెరువు

డివైడరు మార్గానికి పడమర వైపున ఉన్న రోడ్డు మార్గాన్ని గోసాల - మద్దూరు రోడ్డుకు అనుసంధానం చేసే క్రమంలో అప్రోచ్ నిర్మించారు. అయితే అది కాస్తా పల్లంగా ఉండటంతో చిన్న పాటి వర్షం కురిసినా ఈ ప్రాంతం చెరువుగా తయారవుతుంది. భారీ వర్షం కురిస్తే జలమయంగా మారి రాకపోకలకు సైతం ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి. రోజులు తరబడి మురుగు ఎక్కడిదక్కడే నిలిచిపోతుంది. మురుగు కదిలే మార్గం లేదు. దీంతో రోజులు తరబడి మురుగు నిలిచిపోయి గమ్యస్థానాలు చేరుకోవడానికి, స్థానికంగా బస్సులు, ఆటోలు ఎక్కేందుకు వచ్చిపోయే ప్రయాణికులు అవస్థలు ఎదుర్కొంటున్నారు.

జాతీయ రహదారుల శాఖ నిర్లక్ష్యం

అప్రోచ్ రోడ్డుతో ప్రజలు ఇబ్బందులు పడటానికి జాతీయ రహదారుల శాఖ అధికారుల అలసత్వం కారణమంటూ స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. అప్రోచ్ నిర్మించే సమయంలో పారుదల పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా రోడ్డు నిర్మించడం, రోడ్డు మధ్యన డివైడరు ఏర్పాటు చేయడంతో మురుగు పోయే మార్గం లేకుండా పోయింది. అధికారుల నిర్లక్ష్యం శాపంగా మారి మురుగుతో అవస్థలు పడుతున్నామంటూ స్థానికులు వాపోతున్నారు.

రాథ్ ఫెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ



బహుమతులు పొందిన విద్యార్థులు

ఉయ్యూరు: రాథ్ ఫెస్ట్ - 2025లో ఉయ్యూరు విద్యార్థులు ప్రతిభ చాటారు. ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో తెనాలిలో ఈనెల 29న జరిగిన రథయాత్రలో భాగంగా రాథ్ ఫెస్ట్ నిర్వహించారు. రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఈ ఫెస్ట్‌లో శ్రీమ్యూజిక్ ఇన్‌స్టిట్యూట్ కీబోర్డు ఆధ్వర్యంలో వివిధ విభాగాల్లో విద్యార్థులు పాల్గొని బహుమతులు అందుకున్నారు. సీనియర్ కేటగిరీలో కీబోర్డు విభాగంలో సాయి రాఘవకు ప్రథమ బహుమతి, మైథిలీ మిత్రాకు తృతీయ బహుమతి, జూనియర్ కేటగిరీలో భవన్ క్రాంత్ ద్వితీయ స్థానాన్ని, లాస్య ప్రియ తృతీయ స్థానాలను సాధించారు. సబ్ జూనియర్స్ విభాగంలో గగన్ సూర్య ఇన్‌స్ట్రుమెంట్‌లో ద్వితీయ, ఓకల్‌లో తృతీయ, హేమ ద్వితీయ బహుమతులను దక్కించుకున్నారు. గ్రూప్ మ్యూజిక్ విభాగంలో సాయిరాఘవ, భవనక్రాంత్, సూర్య, ప్రతీక్, కార్తీక్‌లు ప్రథమ స్థానంలో నిలిచారు. క్లాసికల్ డ్యాన్స్, ఫ్రీ స్టైల్ డ్యాన్స్ విభాగంలో మైథిలీ మిత్ర ప్రథమ బహుమతి సాధించింది. వివిధ విభాగాల్లో గెలుపొందిన విద్యార్థులకు సోమవారం బహుమతులు అందజేశారని కీ బోర్డు మాస్టర్ ధూళిపూడి శేషగిరిరావు తెలిపారు.

రైతులకు ధాన్యం సొమ్ము వెంటనే చెల్లించాలి

కానూరులో రైతు సంఘం నేతల ధర్నా



కానూరులో ధర్నా చేస్తున్న రైతు సంఘం నేతలు

పెనమలూరు: రైతుల వద్ద రబీలో ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యానికి వెంటనే సొమ్ము చెల్లించాలని డిమాండ్ చేస్తూ రైతు, కౌలు రైతు సంఘం నేతలు కానూరు సివిల్ సప్లయీస్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య మాట్లాడుతూ ప్రభుత్వం రబీలో కొనుగోలు చేసిన ధాన్యం బకాయి రైతులకు ఇప్పటికీ చెల్లించకపోవడం దారుణమన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో రైతులకు ప్రభుత్వం రూ. 36 కోట్లు బకాయి పడిందని తెలిపారు. అలాగే రైతులకు లోడింగ్, డీజిల్ ఖర్చులు, కాటా ఖర్చులు కూడా నేటికీ ప్రభుత్వం ఇవ్వలేదన్నారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు పెట్టుబడి సాయం లేక దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి ధాన్యం బకాయిలను రైతులకు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు అధికారులకు వినతి పత్రం అందజేశారు. ధర్నాలో పలువురు రైతు సంఘ నేతలు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులకు భూమిపూజ

సాక్షి ఎఫెక్ట్



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

కంకిపాడు: గోతులమయంగా మారిన కంకిపాడు - గన్నవరం రోడ్డు మరమ్మతులకు ఎట్టకేలకు శంకుస్థాపన చేశారు. 'రోడ్డు ఛిద్రం - జర్నీ జర భద్రం' శీర్షికన సాక్షిలో గత నెల 24న కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఆర్అండ్‌బీ అధికారులు, ప్రజాప్రతినిధులు కంకిపాడు - కేసరపల్లి వరకూ ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డు మరమ్మతులు చేపట్టేందుకు రూ. 1.86 కోట్లు నిధులు కేటాయించారు. ఈ రోడ్డు మరమ్మతులకు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సోమవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అన్నే ధనయ్య, ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, నాయకులు మద్దాలి సాయిబాబు, ముసిబోయిన మోహనకృష్ణ, తుమ్మల జగదీష్, చిట్టూరి నాగేశ్వరరావు, అన్నే రామారావు, పులి కామేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



పెనమలూరు: పెనమలూరు జెడ్పీ హైస్కూల్‌లో చదివిన పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి తమ వంతు ఆర్థిక సాయం అందజేశారు. ఈ మేరకు సోమవారం చెక్‌ను హైస్కూల్ హెచ్ఎం సుధారాణికి అందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం సుధారాణి మాట్లాడుతూ పెనమలూరు పాఠశాలలో 1973-74లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి రూ. 1,84,316 సాయం చేశారని తెలిపారు. పూర్వ విద్యార్థులు సహాయ సహకారాలతో పెనమలూరు హైస్కూల్ దినదినాభివృద్ధి చెందుతోందన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, గ్రామ ప్రముఖులు మారుపూడి ధనకోటేశ్వరరావు, తాతినేని రమేష్, జి.యోహాన్, కె.గిరిధర్, బి.కోటేశ్వరరావు, ఎ.నారాయణరావు, టి.జయలక్ష్మి, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కిలారు శివకుమార్ పలువురు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థి



పతకాలు సాధించిన అశ్విన్

కంకిపాడు: సౌత్ ఇండియా క్రీడా పోటీల్లో గొడవర్రు జెడ్పీ పాఠశాల విద్యార్థి సత్తా చాటాడు. ప్రతిభ చాటిన విద్యార్థి బుస్కా అశ్విన్‌ను పాఠశాల హెచ్ఎం కె.సుబ్రహ్మణ్యం సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌సీఎల్ సంస్థ ఇటీవల బెంగుళూరులోని తుమ్కూరు ఎంజీ స్టేడియంలో సౌత్ ఇండియా (సౌత్ జోన్) పోటీలు నిర్వహించారన్నారు. ఆరు రాష్ట్రాల నుంచి క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. పాఠశాలకు చెందిన విద్యార్థి బుస్కా అశ్విన్ షాట్ పుట్, జావెలిన్ త్రో విభాగాల్లో సౌత్ జోన్ ప్రథమ స్థానంలో నిలిచి పతకాలు సాధించాడని చెప్పారు. పతకాలు సాధించిన విద్యార్థిని ప్రత్యేకంగా అభినందించారు.

అధ్వానంగా అంతర్గత రహదారులు



బురదకొయ్యగా మారిన మల్లవల్లి బీసీ కాలనీ రోడ్డు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలోని కుమ్మర కాలనీలో అంతర్గత రహదారులు అధ్వానంగా ఉన్నాయి. కొద్దిపాటి వర్షానికే జలమయం కావడంతో పాటు బురదకొయ్యగా మారుతున్నాయి. ఈ రోడ్లపై రాకపోకలు సాగించేందుకు స్థానికులకు నానాపాట్లు పడుతున్నారు. గుంతలు, బురదమయంగా ఉన్న రోడ్లపై ద్విచక్ర వాహనాదారుల ప్రయాణం సర్కస్ ఫీట్లను తలపిస్తోంది. పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల అవస్థలు చెప్పలేనివి. ఈ రోడ్లపై నడకతో ఒళ్లు, దుస్తులు బురదమయంగా మారుతున్నాయి. ఇక స్థానికుల చెప్పులు చేతితో పట్టుకుని ఈ రోడ్లపై నడవాల్సిన దుస్థితి ఏర్పడింది.

గోల్డ్ రికవరీలో చేతివాటంపై కొనసాగుతున్న విచారణ

గన్నవరం: చోరీకి గురైన బంగారం రికవరీలో ఉంగుటూరు మండలం ఆత్కూరు పోలీసులు చేతివాటం చూపించడంపై పోలీస్ ఉన్నతాధికారులు దృష్టి సారించారు. ఈ ఘటనలో బాధితులైన ఏలూరుకు చెందిన నగలు దుకాణం యాజమాని నుంచి వివరాలు రాబడుతున్నారు. 'బంగారం రికవరీలో పోలీసుల చేతివాటం'పై ఈ నెల 28న సాక్షిలో వచ్చిన కథనం పోలీస్ శాఖలో కలకలం రేపింది. సదరు నగల వ్యాపారి నుంచి చోరీకి గురైన 22 క్యారెట్ల రెండు కాసుల బంగారు గొలుసులకు బదులుగా తక్కువ నాణ్యత కలిగిన బంగారం రికవరీ చేయడం, రూ. 40 వేలు నగదు వసూలు చేయడం ఆడియో రికార్డులతో సహా పోలీసులు దొరికిపోయారు. ఇంకా నగదు కోసం పోలీసులు వేధిస్తుండటంతో సదరు నగల వ్యాపారి పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ ఘటన వెలుగుచూసింది. దీంతో అప్రమత్తమైన ఆత్కూరు ఎస్ఐ సురేష్ నగల వ్యాపారితో రాజీ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఏలూరులోని నగల వ్యాపారుల సంఘ నేతల ద్వారా సదరు నగల వ్యాపారి రాజీకి రావాలని ఒత్తిడి తీసుకువస్తున్నారు. అంతేకాకుండా ఏలూరుకు చెందిన మరో ఎస్ఐ ద్వారా నగల వ్యాపారిపై ఒత్తిడి తీసుకు వస్తున్నట్లుగా తెలుస్తోంది. అయితే పోలీసుల వేధింపులతో తీవ్ర మనోవేదనకు గురై అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న నగల వ్యాపారి మాత్రం ఉన్నతాధికారులకు చేసిన ఫిర్యాదుకే కట్టుబడి ఉండటంతో ఆత్కూరు పోలీసులు రాజీ ప్రయత్నాలు బెడిసికొట్టినట్లుగా తెలుస్తోంది. ఈ ఘటనపై పోలీస్ ఉన్నతాధికారులు ఎటువంటి చర్యలు తీసుకుంటారోననే ఆసక్తి సర్వత్రా నెలకొంది.

పోలింగ్ బూత్‌లను పునర్వ్యవస్థీకరించాలి



రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తున్న తహసీల్దార్ మురళీకృష్ణ

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం పోలింగ్ బూత్‌లను పునర్వ్యవస్థీకరించి, అదనంగా మరో ఏడు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయాలని పలువురు రాజకీయ పార్టీల ప్రతినిధులు తహసీల్దార్ బి.మురళీకృష్ణకు విజ్ఞప్తి చేశారు. స్థానిక మహాత్మాగాంధీ నగర్‌లోని మండల రెవిన్యూ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ బి.మురళీకృష్ణ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. గత సార్వత్రిక ఎన్నికల నాటికి మండలంలో 83 పోలింగ్ బూత్‌లు ఉండగా, కొత్తగా రంగయ్య అప్పారావు పేటలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. మండలంలో ప్రస్తుతం 1,200 మంది పైబడి ఓటర్లు ఉన్న పోలింగ్ బూత్‌లు ఏడు చోట్ల ఉన్నాయని, ఓటర్లకు అనుకూలంగా ఉండేందుకు వాటిని విభజించాలని పలువురు రాజకీయ పార్టీల ప్రతినిధులు కోరారు. అంతేకాకుండా సింగన్నగూడెం, మల్లవల్లి, బాపులపాడులోని కొన్ని పోలింగ్ స్టేషన్లు ఇరుకు భవనాల్లో ఉన్నాయని, వాటిని విశాలమైన ప్రభుత్వ భవనాల్లోకి మార్చాలని కోరారు. టీడీపీ ప్రతినిధులు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు, రాజేశ్వరరావు, బీజేపీ ప్రతినిధి తోట మురళీధర్, జనసేన ప్రతినిధులు వడ్డి శివ నాగేశ్వరరావు, షేక్ అహ్మద్, అశోక్ పాల్గొన్నారు.